కథానిక

# కథల్లో మనుష్యులు

ఇసుకపల్లి దక్షిణామూర్తి

గోపిగాడు గోపాలరావు అని పేరు మార్చుకున్నాడు. తన చింపిరి గుడిసెకు ఆనంద భవన్ అని పేరుపెట్టాడు.

పోలిగాడి కూతురు పోచమ్మను పాంచాలి అని పిలుద్దా మనుకున్నాడు. వాళ్ల గుడిసె గూడా అతని 'ఆనంద భవన్'కు దగ్గరలోనే వుంటోంది. దానికి ఎటువంటి పేరు పెట్టితే బాగుంటుందో తెమలక పూరుకున్నాడు.

గోపాలరావు కథానాయకుడు. సినిమా హీరోకి పెట్టగా వచ్చిన గిరజాల జుట్టు, కొయ్య కత్తులతో నిజం కత్తులతో మాదిరి పోట్లాడగల పరాక్రమం అతనికి సహజంగా వున్నాయని అనుకున్నాడు. అతని జుట్టు నొక్కులు తిరిగి వుంటుంది. ముంగురులు నుదుటమీద పడతాయి గాని గాలికి అల్లలాడటం లేదు. అందుకని గాలి బాగా వస్తున్నప్పుడు వూరి బయటకు పోయి అద్దంలో తన ముఖం చూచుకుంటాడు. అతని ముఖకవళికలో ఎక్కడినుంచో ఆనంద రేఖ వకటి తొంగి చూస్తుంది. ఆ రేఖ వెంబడి బయలుదేరి అతని మనస్సు ప్రయాణం కట్టుకుంది. రైలుస్టేషనూ....మద్రాసు నగరం.... సినిమాస్టూడియో .... డైరెక్టరు ఆహ్వానం.... తనతోపాటు రాణిగా నటించబోయే నటీమణి వయ్యారం....కెమేరా ముందు నుంచోవటం.... లక్షల రూపాయలు తను పెట్టుకోవటానికి చోటు లేకుండా మీద వర్షించటం....

ఆ రేఖ అంతటితో ఆగిపోతుంది. అతని ప్రయాణం తిరుగుముఖం పడుతుంది. తను దర్శించినవన్నీ తిరుగు ప్రయాణంలో రైల్వే స్టేషన్లలాగా కళ్ల ముందరకు వస్తాయి. తన ముందు అద్దంలో ప్రతిబింబం వెక్కిరిస్తుంది. తనకంటే తన బొమ్మే అందంగా వుందని పిస్తుంది. తన ముఖాన్ని తను స్వయంగా చూచుకోవాలని ఎంతగానో వుబలాటపడతాడు. ఎన్నిరకాల ప్రయత్నాలో చేశాడు. ఎన్ని పద్ధతుల్లో చూచినా తనకు తన ప్రతిబింబమే దర్శనమిస్తోంది.

కథానాయకుడికి వుండవలసిన లక్షణాల్లో వకటి అతని విషయంలో లోపించినట్లనిపిస్తుంది. అతను నడుస్తుంటే వాద్యబృందాలు మ్రోగటంలేదు. అతనికింద గుర్రం నడవడం కాదు. గుర్రం కంటె బరువయిన హృదయాన్ని అతనే మోసుకుపోతున్నాడు. అతను యింట్లోకి వస్తున్నప్పుడు బయటకు పోతున్నప్పుడు ఈల పాటతో అతనే ట్యూను వేసుకుంటున్నాడు. ఈలపాట పాడతాడు. ఆ పాట అతని అడుగులకు తానం సరిపుచ్చుతుంది. అతని శరీరావయవాలు పరస్పర సహకారాన్ని ఇస్తునేవుంటాయి.

స్వవిషయంలో అయితే ఫరవాలేదు. అప్పుడప్పుడు 'అందాల మేఘమాలా' అని పాడతాడు. అతని మాటలే అతని చెవులకి వినబడతాయి. అవి మేఘాల దగ్గరకు పోలేవు. తను మేఘాలను పాంచాలి గుడిసెమీద కూడా ఎగిరి తన ప్రేమసారాన్ని వర్షించమని కోరతాడు. అప్పుడు మేఘాలు తనింటిమీద కూడా యింకో దిక్కుకు పోతాయి. వాటిని మనసులో ఎంతగానో ప్రార్థిస్తాడు. తన ప్రేమసారాన్ని పాంచాలి గుడిసెమీద కాకపోతే యింకెక్కడా వర్షించవద్దనీ, తన నిష్కల్మష ప్రేమను అపవిత్రం చెయ్యవద్దని అతని కొచ్చిన భాషలో చెప్పకుంటాడు.

ఒకోసారి పాంచాలి గుడిసెమీదగా తనింటికి మేఘాలు వస్తూ వుంటాయి. అవేమయినా సందేశం తెస్తున్నాయేమోనని ఎదురుచూస్తాడు. ఒకొక్క తెల్లని మేఘం వారి ప్రేమ స్వచ్ఛతను తెలియజేస్తున్నట్లు అతనికి తోస్తుంది. ఆ మేఘం తన చూపుమేర దాటేటంతవరకూ అలాగే

గుడ్లప్పగిస్తాడు. అతని హృదయంలో వక భీతి కలుగుతుంది. ఒక అనుమానం బయలుదేరుతుంది. సందేశం తెచ్చిన మేఘం తన గుడిసె మీద ఆగక ఇంకెక్కడకో పోతోందేం....ఆ సందేశం ఎవరి దగ్గరకు తీసుకుపోతుందో! అతని గుండె అతని మాట విననంటుంది అతను వీల్లేదంటాడు. అతని వక్షస్థలంమీద లోనుంచి దబదబా కసితీరా బాదుతుంది అతని హృదయం....

ప్రేమకోసం బలియైన మజునూ లాంటి వాళ్లని ఎంతమందినో చూశాడు గోపాలరావు. తనుగూడా అలాగే ప్రేమించి బలియై పోవాలనుకున్నాడు. లైలా మజునూ సినిమా చూచి వచ్చిన రాత్రి కలవరించాడు. తన పాంచాలిని ఎవరికో యిచ్చి వివాహం చేశారు. ఆమె ఒంటెలమీద ఎక్కడికో వెళ్ళిపోతోంది....అతను ఒంటికాళ్లు పట్టుకుని ఆమె కూర్చున్నచోటికి పాకగలిగాడు. ఆమె బెదిరింది. కన్నీరు కార్చింది. అతను ప్రేమ భిక్ష పెట్టమన్నాడు. అతన్నెవరో తోసేస్తున్నారు. కింద పడిపోతున్నాడు .... నిలదొక్కుకో లేకపోయాడు. కిందపడిపోయాడు. అప్పటికే కింద పాంచాలి పడిపోయివుంది. చచ్చిపోయిందని వెంటనే తెలుసుకోలేక పోయాడు. తరువాత తనుగూడా చచ్చిపోదామనుకున్నాడు. ఎంత ప్రయత్నించినా కుదరలేదు. సినిమాలో మజునూ ఎలా చచ్చిపోయాడో గుర్తుకు తెచ్చుకున్నాడు. అలా చావటం అంత తేలికయిన పని కాదు. భావాలభారం అతని మెదడును కుంగతీసి, అతని హృదయంలోకి వచ్చి అతనికి మేలుకొలుపు ప్రసాదించింది. కళ్లు నులుముకుని చూశాడు. కలలోనైనా ప్రాణత్యాగం చెయ్యలేనందుకు నిందించుకున్నాడు. ఆ రోజు యింకో సినిమా చూశాడు. అదీ ప్రేమకోసం బలియై పోయిన జీవి గాథే వాతావరణం వేరుగా ఉంది. మజునూగా వేషంవేసి చచ్చిపోయిన వ్యక్తే ఈ సినిమాలోగూడా చచ్చిపోతాడు. గోపాలరావు మనస్సు తేలికపడుతుంది. ఆ రోజు రాత్రయినా ఆ సినిమానంతా కలగని సినిమాలోమాదిరి కలలో చచ్చిపోదామనుకున్నాడు.

ఆ రాత్రి కలరాలేదు. తెల్లవారుజామున మెలకువ వచ్చింది. అనందభవన్ ముంగిట నిలబడి పాంచాలి యింటివైపు దృష్టి ప్రసరించాడు. పాలసముద్రంలో తిమింగలాల్లాగా ఆ తెల్లని వెన్నెల్లో గుడిసెలన్నీ కనపడుతున్నాయి. భావుకుడై కళ్లుమూసుకుని గుడిసెవైపు చూశాడు. పాంచాలి ఆ గృహ ప్రాంగణంలో నిలబడింది. ఆమె ముత్తైదువు ముఖాన బొట్టులాగా వుంది. అతను ముత్తైదువు నుదురులాగా మారిపోయి ఆమెను తన గుండెల్లోకి చేర్చుకుందా మనుకున్నాడు. అతని భావన కరిగిపోయింది కళ్ళు తెరిచాడు.

అతని ఎదురుగా పాంచాలి నిలబడింది. అతను వళ్ళంతా కళ్ళుగా చేసుకున్నాడు. ఆమె శరీరాన్ని అతని కళ్ళన్నీకలిసి కబళించి వేస్తున్నాయి ఆమె నవ్వటంలేదు. ఆమె పెదవులు దొండపండును గుర్తుకు తేలేదు. ఆమె కనుకొలకులలో మెరమెరనుచూస్తే మహోన్నతమయిన శిఖరానికెక్కి లోయలోకి తొంగి చూసినట్లు తోచింది. అతను కళ్లు మూసుకున్నాడు. తిరిగి కళ్ళుతెరచేటప్పటికి పాంచాలి అక్కడలేదు.ఆమె అడుగులజాడలు పోనుపోను చిన్నవైపోతూ ఆమె యింటిలోకి జొరబడ్డాయి. వాటినిచూస్తే స్వర్గానికి వేసిన నిచ్చెనమెట్లలా కనపడుతున్నాయి. వాటివెంబడి పోదామనుకున్నాడు. మెట్లున్నాయి గాని పట్టుకోవటానికి వాసాలులేవు. అతనికి ధైర్యం చాలలేదు. ఇంట్లోకిపోయి తన హృదయాన్ని కన్నీళ్ళతో కడుక్కున్నాడు

అతనికిప్పుడు ఒక పెద్ద లోపం ఒకటి కనిపిస్తోంది. కథలో నాయకుడూ, నాయకురాలూ వున్నారుగాని విలన్ లేడు. ఎవరయినా దుష్టపాత్ర వుండాలి అటువంటిదానిలో అతని ప్రేమకు పోటీపడి ఆ ప్రేమాగ్నిలోపడి శలభంలా కాలిపోయే భీరువయితే కథ సుఖాంతం అవుతుంది. కలల్లో ట్రాజెడీకోసం కలవరించి చచ్చిపోలేక కల వదుల్చుకుని నిజ ప్రపంచంలోకి వస్తున్నాడు. అటువంటిది నిజ ప్రపంచంలో కథ సుఖాంతంగాక వుండాలి. దుఃఖాంతంగా పరిణమిస్తే తను తన జీవిత పాత్రను

ఎంత చక్కగా నిర్వహించిందీ బయట వాళ్లకు తెలియవచ్చుగాని అతను ఆనందించే అవకాశం వుండదు.

ఆ దుష్టపాత్ర అతనికి దానంతట అది కొంతకాలానికి దొరికేవరకు అతను వూహించనే లేకపోయాడు. పాంచాలి వివాహం నిశ్చయమైంది. ఆ సంగతి తనకు కబురుగూడా అందలేదు. ఎవరో చెప్పగా విన్నాడు. పాంచాలినడిగి నిజం తెలుసుకుందామనుకున్నాడు. వాళ్లింటికి ఏముఖంపెట్టుకు పోవాలో నిర్ణయించుకోలేక ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

ఆరోజు రాత్రి పెళ్ళి. సన్నాయి రాఘవులు వాయిస్తున్నాడు. ఆ వాద్యం తన ప్రేమపాశాన్ని ముక్కలుముక్కలుగా ఛేదిస్తున్నట్లు తోస్తోంది. డోలు చప్పుడు అతని వెన్నెముకమీద దుష్టనృత్యం చేస్తుంది. మేళం ఆపెయ్యమని చెవుదామనిపించింది. మేఘాలు పాంచాలి యింటిమీదుగా వచ్చినవి తనవాకిట్లో వర్షిస్తున్నాయి. మేళాలు వినబడుతునేవున్నాయి. ఆ వానలో నిలబడి శరీరాన్నంతటినీ తడుపుకున్నాడు. అతను పాంచాలి ఆలింగనంలో మైమరచినట్లు వూహించాడు. వాన పెద్దదయింది. మీద చురుక్కు చురుక్కుమని తుంపరలు రాలుతున్నాయి. ప్రేమబాణాలు పూలబాణాలుగా వున్నంతకాలం సహించగలిగిన ప్రేమికుడు వాడి తూపులతాకిడికి తాళలేకపోయాడు. గుడిసెలోకి జొరబడి బట్టలు మార్చుకున్నాడు.

వాన వెలిసింది. పెళ్ళివారు పూరేగుతున్నారు. తన వాకిటిముందుగానే పోవచ్చు. ఒంటెలమీద పోయే లైలా బంగారు పల్లకిలో పోయే మల్లీశ్వరీ గుర్తుకువచ్చారు. తన స్థితి నిర్ధారణ చేసుకునేలోపుగనే పెళ్ళిమేళం వాకిటి దగ్గరకు వచ్చింది. పోటీపడి ఇద్దరు డప్పుల వాళ్లు నృత్యం చేస్తున్నారు. పాంచాలి తన కొంగును ఎవరి జీవితానికో ముడి వేయించుకుంది. కాళ్ళకి చెప్పులు గూడా లేకుండా పాదచారియై తన వాకిటిగుండా పోతోంది. తలుపు లోపల కాసుకుని చూరులోనుంచి చూస్తున్నాడు. అన్నీ మంగళ వాద్యాలే. విషాదంగా స్వరం వినబడటం లేదు. అతను మనసులో కొన్ని స్వరాలు అనుకున్నాడు. అవి అతన్ని వేధిస్తున్నాయి. మంగళ స్వరం దూరం అయిపోయింది. అప్పటిదాకా పెద్దపెట్టున నవ్వుతున్నట్లు చప్పుడు చేస్తున్న గాలి, భోరుమని ఏడుస్తున్నట్లు వినిపిస్తోంది.

ఆ రాత్రి నిద్రపట్టలే దతనికి. ఎన్నో కలవరిద్దామనుకున్నాడు. ఒక్కటీ కుదరలేదు. చీకటి వెలుగుకు చోటిచ్చింది. తన గుడిసెమీద కెక్కిన కోడి అతన్ని లేవమని హెచ్చరించింది.

అట్లా ఎన్ని రోజులో గడిచాయి. అతని కళ్ళల్లో నీళ్ళన్నీ ఖర్చయిపోయాయి. ఎర్రగా కళ్ళు మండిపోతున్నాయి. నల్లగుడ్డు తేలిపోతోంది.

ఆ రోజు దుష్టపాత్ర అతనికి గుర్తు వచ్చింది. తన జీవితవనంలో పూలమొక్కలమీద నిప్పులు వర్షించిన అతని జీవితాన్ని అంతంచెయ్యాలనుకున్నాడు. అతని దగ్గర రాజుల దగ్గరవుండే కత్తులుగానీ, విల్లంబులుగాని లేవు. శూలాలు లేవు, గదలు లేవు. కత్తిపీట వుంది. పచ్చడి బండ వుంది. కంకటి రాళ్లున్నాయి. అతను ఆలోచిస్తున్నాడు.

ముడి తెగిపోతే చిల్లుపడిన కుంభమాదిరి పాంచాలి జీవితం అయిపోయి ఆమె జీవ ప్రవంతి పారిపోతుందేమో! ఎండిపోయిన మోళ్ళనా అతను ఆశించింది? లే చిగుళ్లతో, పచ్చని పూలతో వున్న కల్ప వృక్షాన్ని ఆశించిన తను, ఆ వృక్షం ఎవరి దొడ్లో నయినా వుంటే, తన దొడ్లో పెంచుకోలేనందుకు విచారించినా, ఆ మొక్క ఎక్కడయినా మూడు పువ్వులూ, నాలుగు కాయలూ పొందాలనేగదా కోరుకొనేది!

అతని ఆలోచనలు అతని మెదడు దాటి తలమీద విహరిస్తున్నాయి. పెద్దగా నిస్వనం వకటి వదలి వీధిలోకి వచ్చాడు. పాంచాలి యింటిమీదగాని, తన యింటిమీదగాని మేఘాలు లేవు. ఆకాశమంతా సముద్రంలాగా వుంది. పాంచాలి యింటిలోనుంచి గొల్లున ఏడుపులు వినిపించినాయి. ఆ తరంగం అతని హృదయానికి సూటిగా, బలంగా వచ్చి తాకింది. పడవ తలక్రిందులయినంత పనయింది. మనసు దిట్ట

(తరువాయి 46-వ పేజీలో)

కుంగిపోదూ?'' అన్నట్లు తమ తమ తఖ్తుల్ని గట్టిగా పట్టుకుంటారు. భగవద్గీత ఎంతగా పారాయణచేసినా, అనాసక్తయోగాన్ని అలవరచుకోలేరు సరిగదా, కర్మ చేయడమంటే, యువకతరాన్ని వీలయినంత దూరంగా ఉంచి తాము పెత్తనం చెలాయించడమే ననుకుంటారు. ఆ మృత్యుదేవత కరుణించి వాళ్ళని పీఠాలనుండి బలవంతంగా దింపాలిగాని— తమకు తామై ఎన్నడూ దిగరు.

తత్ఫలితంగానే ఇవాళ భారతదేశాన్ని అన్ని రంగాలలోనూ పరిపాలిస్తున్నది ఒక పెను వార్ధక్యం. కేంద్రాధిపతులలో నేడనేకులు జరాకృశులు ఒకరికి చూపు సరిగా ఆనదు; ఒకరు శబ్దప్రపంచానికి పూర్తిగా అతీతులు. ఇంకొకరు మెడమీద తల నిలబెట్టలేరు. వేరొకరు ముగ్గురు మనుషుల సహాయం లేనిదే కారులోంచి బైటకు అడుగుపెట్టలేరు. ఐనప్పటికీ అన్ని కష్టాలకూ ఓర్చి అలా దేశసేవ కోసం పదవుల్ని నిర్వహిస్తూనే ఉన్నారు గాని, విశ్రాంతి కోరుకోవడం లేదు. "మీ క్షేమం కోసమే మేము ఇంతగా యాతనపడి యీ పదవి భారం మొయ్యవలసి వస్తోంది!" అని వాళ్ళు పదేపదే అంటూంటే చివరికి అది నిజమేనని మనమూ చచ్చినట్లు నమ్మవలసి వస్తోంది. "వీళ్ళు లేకపోతే ఎలాగ? దేశం ఏం కాను?" అని భయపడిపోతున్నాం.

కేంద్రాధిపతులు అలాంటి వాళ్లు కాబట్టి తక్కిన అన్ని రంగాలలోనూ వార్ధక్యానికే పట్టాభిషేకం. అంచేత భాగ్యాధిపతులు, రాజ్యాధిపతులు, సంగీత, సాహిత్య, విద్యాది సమస్త అధిపతులూ షష్టిపూర్తి ఏనాడో చేసుకుని, రెండవ షష్టిపూర్తికి ఆసక్తితో ఎదురుచూస్తున్న వాళ్లే. వీళ్లకి భవిష్యత్తు మీద కంటే గతం మీదనే ఎక్కువ ఆప్యాయత. అంచేత కాంగ్రెసు నాయకుడు ఉపన్యాస వేదిక ఎక్కితే చాలు, బార్డోలీ సత్యాగ్రహం నుండి మొదలెట్టి స్వాతంత్రోద్యమందాకా వచ్చి ఆగిపోతాడు. సాహిత్యవేత్తా, కవీ అయితే నన్నయ్య దగ్గరనుండీ ప్రారంభించి తన కవిత్వంతో ఆగిపోతాడు. వీరపూజ పేరిట జయంతులూ వర్ధంతులూ అంటూ తద్దినాల కార్యక్రమం భారీగా సాగిస్తారు యీ పెద్దలంతా. కాలాన్ని మొత్తమ్మీద వెనక్కు నెట్టాలనే యీ పురాణ పురుషుల నిర్విరామ కృషి. ఎటు చూసినా యిలా వృద్ధ వృద్ధ వృద్ధతలు స్వైరవిహారం చేస్తూండడమే కనబడేసరికి యువకతరాల వారికి కర్తవ్యం తోచక నిజమైన అనాసక్త యోగం అలవరచుకుని దృష్టి అంతర్ముఖం చేసుకుంటున్నారు. అలనాడు ఎప్పుడో యయాతి తన కొడుకు నుండి యౌవనాన్ని గుంజి పుచ్చుకున్నాడనీ పురాణాల్లో వ్రాశారు. కాని, ఇవాళ మన పెద్దలందరూ యయాతులే. వాళ్ల తరవాతి తరం వారందరూ కర్తవ్యం తెలియని నిస్సహాయులైన పుత్రీపుత్రులు.—(గోరా)

---

(44 వ పేజీ తరువాయి)

పరచుకున్నాడు. ఆ విషాద స్వరాన్ని అతను ఆశించలేదు. దానికి కారణ మేమిటో గూడా అతడు వూహించలేదు. పాంచాలి వేసుకున్న ముడి తెగిపోయింది, లైటులో బ్యాటరీయే ఐపోయిందో, బలుబే మాడిపోయిందో, అక్కడ వెలుతురు వచ్చే అవకాశం అయిపోయింది. కారుచీకటి తన నల్లని హస్తాలతో అతని జీవితాన్ని చుట్టి విరిచివేస్తోంది. అతని నోట మాట పెగలటం లేదు. ఎక్కడో పాంచాలి మాట్లాడుతున్నట్లు తోచింది. ఆవిర్భవించిన స్థానం తన వునికిని చెప్పటం లేదు. బాగా పరిశీలించాడు. అతని హృదయం మాట్లాడుతోంది. బాగా విన్నాడు. మాటల వివరం తెలియకపోయినా భావం స్ఫుటంగా స్ఫురిస్తునే వుంది. మైలురాయి దగ్గర కూలబడిపోయి దాన్ని కౌగలించుకుని నిజమైన ఏడుపు వినిపించాడు. అతని తంత్రులన్నీ విషాదగీతాన్ని ఆలపించినాయి. అతని అణువు అణువు వుద్రేకించి కన్నీరుగా మారింది. అతని హృదయం కరిగిపోయింది. ఆ ఏడ్పులోఅతని ప్రేమపాశం చుక్కాని లేని పడవలా తేలిపోయింది. అతను అక్కడినుంచి లేవలేదు. తిరిగి అతని మనస్సు కలవరించటానికి ప్రయత్నమయినా చెయ్యలేదు. ★

Source: Press Academy Website, Telugu Swatantra, 1957

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/